క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు


దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా విశేష పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వీబీఆర్‌కు 3 వేల క్యూసెక్కుల నీరు

వెలుగోడు: కృష్ణా జలాలు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నాయి. గురువారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ ఛానల్ మీదుగా 3 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. వీబీఆర్‌లో ప్రస్తుతం 845.930 అడుగుల వద్ద 257.83 మీటర్ల నీటి మట్టం ఉన్నట్లు చెప్పారు. రిజర్వాయర్‌లో 7.251టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు. వీబీఆర్ నుంచి వన్ ఆర్ తూముకు 60 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు, మద్రాస్ కాల్వకు 2 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

నందికొట్కూరు రూరల్ : రైతులు సాగు చేసిన పంటల్లో తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో షేక్షావలి సూచించారు. గురువారం మండలంలోని మద్దిగట్ల పొలిమేరలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంటలసాగులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా సాగులో లాభాలు పొందవచ్చని తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి


కంబాలపల్లిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ అన్నారు. మండలంలోని మిట్టకందాల, కంబాలపల్లి గ్రామాల్లో పంట నమోదు, పొలంబడి కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలున్నాయా అని వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వలన పంట రుణం, పంట నష్టపరిహారం, బీమా పరిహారం, పంటలకు మద్దతు ధర లేనప్పుడు ప్రభుత్వం ప్రకటించిన ధరకు అమ్ముకోవడానికి వీలుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట వీఆర్‌ఓ రాము, గ్రామ వ్యవసాయ సహాయకులు షబ్బీర్‌బాషా, ముస్‌షేర్, చాంద్‌బాషా ఉన్నారు.

అక్రమ మద్యం తరలిస్తే చర్యలు

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా అక్రమ మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని బ్రాహ్మణకొట్కూరు ఎస్.ఐ ఓబులేసు హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామం వద్ద తెలంగాణ నుంచి ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 80 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పైపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, బొల్లవరం గ్రామానికి చెందిన సయ్యద్‌బాషాలను అరెస్టు చేసి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అధ్యాపకులకు డాక్టరేట్


ఎమ్ పద్మ

సుజాత

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎమ్ పద్మ రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి ఆచార్యులు ఎస్.కాశీ విశ్వనాథ్ పర్యవేక్షణలో 'కాంటెక్ట్ అవేర్ ఫ్రేమ్ వర్క్ ఐఓటీ డాటా- కమ్యునికేషన్ యూజింగ్ ఎస్‌సీటీపీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న వేమ సుజాత శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. చంద్రిక పరిణయం - సమగ్ర కావ్యానుశీలన అనే గ్రంథంపై చేసిన పరిశోధనకు వర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందజేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, అధ్యాపకులు ఆమెను గురువారం సన్మానించారు.

'మల్యాల'తో పంటలకు ఊరట

- మల్యాల ఎత్తిపోతల ఫేజ్-1, ఫేజ్-2 పథకాల నుంచి నీటి విడుదల
- నాలుగు మోటార్ల ద్వారా పంటలకు నీరు సరఫరా
- 9,800 ఎకరాలకు సాగునీరు


డీసీ ద్వారా నీటిని రిలీజ్ చేస్తున్న మల్యాల ఫేజ్-2 కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి


మొక్కజొన్న పొలానికి పారుతున్న నీరు

పగిడ్యాల: మల్యాల ఎత్తిపోతల ఫేజ్-1, ఫేజ్-2 పథకాలు ఖరీఫ్ పంటలకు ఊరటనిస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నెలలో తీవ్ర వర్షాభావం నెలకొనడం వలన మెట్ట భూముల్లో సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, మినుము, కంది తదితర పైర్లు దెబ్బతింటున్నాయి. దీంతో నాలుగు రోజుల నుంచి మల్యాల ఎత్తిపోతల స్కీం నీటిని రైతులు పారించుకొని పంటలను కాపాడుకుంటున్నారు.

పంటలను కాపాడేందుకే..

శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను ఆధారం చేసుకుని నిర్మించిన మల్యాల ఫేజ్-1, ఫేజ్-2 ఎత్తిపోతల పథకాలను ఏటా 9,800 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగైన పైర్లు వర్షాభావంతో ఎండిపోయే పరిస్థితుల్లో వాటిని కాపాడేందుకు మల్యాల ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల(డీసీ) ద్వారా నీటి సరఫరా చేస్తారు. ఎండిపోతున్న మొక్కజొన్న పైర్లను కాపాడేందుకు మల్యాల లిఫ్ట్ నీరు ఎంతో దోహదం చేస్తోందని పగిడ్యాల, జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే చాలా చోట్ల పంట కాలువలు లేకపోవడంతో పొలాలకు నీరు పారించుకోలేకపోతున్నారు. గంతలో కాలువలు తవ్వడానికి కొందరు రైతులు నిరాకరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పంటను బట్టి పన్ను వసూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఫేజ్-1, ఫేజ్-2 పథకాలకు నీటి సలహా మండలి చైర్మన్‌ల కమిటీ తీర్మానంతో ఎకరాకు పంటను బట్టి తడికి రూ. 1000 నుంచి రూ. 2000లు పన్ను వసూలు చేస్తున్నారు.

పంట కాలువలు తీయిస్తే బాగుంటుంది



ఎండిపోతున్న మొక్కజొన్న పైర్లను చూసి బాధేస్తోంది. మల్యాల లిఫ్ట్ నీళ్లు వస్తున్నా వాటిని పైర్లకు పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. పంట కాలువలు తవిస్తే బావుంటుంది. ఎకరాకు రూ. 1000 నుంచి రూ. 2 వేలు వసూలు చేస్తున్నారు. కమిటీ చైర్మన్‌లు రైతుల కోసం పనిచేస్తే బావుంటుంది.
– పెద్ద శాలు, నందికొట్కూరు రైతు

రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంది



మల్యాల ఎత్తిపోతల ఫేజ్-1, ఫేజ్-2 పథకాలు మెట్ట ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. వర్షాభావం ఏర్పడితేనే మోటార్లను రన్ చేయించుకుంటాం. పంట కాలువలను తీయడానికే ప్రయత్నిస్తే చాలా మంది రైతులు కోర్టు నుంచి నోటీసులు పంపారు. అందుకే కాలువలు తీయలేదు. డీసీలు కూడా తమ పొలాల్లో వేయరాదని చాలా మంది రైతులు అడ్డుకున్నారు. ఇప్పుడు వాటి అవసరం ఏర్పడటంతో.. పంట కాలువలు లేవు, డీసీలు లేవు అని ఆందోళనకు గురవుతున్నారు. – రైతు సంఘం బాబు, నందికొట్కూరు

పంట కాలువలు రైతులే తీసుకోవాలి



మల్యాల ఎత్తిపోతల ఫేజ్-1, ఫేజ్-2 పథకాల కింద 9,800 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఖరీఫ్‌లో సీజన్ మెట్ట పొలాల్లో వర్షధారం కింద సాగు చేసిన పైర్లు వర్షాభావం నెలకొని దెబ్బతింటే వాటిని కాపాడేందుకు ఈ స్కీంల ద్వారా రోజుకు నాలుగు మోటార్ల ద్వారా 152 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తాం. అయితే ఈ పథకం రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడెట్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నందున రైతులే పంట కాలువను తవ్వించుకుని నీటి తడులు కట్టుకోవాలి. రైతులు సులభంగా నీటిని కట్టుకోవడానికి డీసీలు నిర్మించారు. – నారాయణరెడ్డి, ఏఈ, మల్యాల లిఫ్ట్

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులకు గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాబాష , సురేంద్ర, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోండి

మిడుతూరు: దూరవిద్య ద్వారా ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దూరవిద్య ఇంటర్మీడియెట్ అడ్మిషన్లకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

స్ప్రేయర్ పంపిణీ

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో షేక్షావలి సూచించారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతులకు సబ్సిడీ కింద వచ్చిన తైవాన్ స్ప్రేయర్‌ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతున్నల కోసం ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ శాంతరాజు, రైతులు పాల్గొన్నారు.

మోడల్ లేఅవుట్‌గా ఎంపిక చేయడం హర్షణీయం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: నంద్యాల జిల్లాలో నందికొట్కూరు జగనన్న లే అవుట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని జగనన్న లేఅవుట్-1 కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ నెలాఖరులోపు 195 గృహాలకు ప్రవేశాలు జరిగేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచితంగా ఇస్తున్నామన్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు నీటి సౌకర్యం కల్పించడం జరిగిందని చెప్పారు. కౌన్సిలర్లు లాలు ప్రసాద్, రవూఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బయటపడుతున్న సంగమేశ్వరాలయం


కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం

కొత్తపల్లి: రోజురోజుకు సంగమేశ్వరం సమీపంలో కృష్ణా జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి బయట పడుతుంది. వర్షాలు లేకపోవడం, విద్యుత్, సాగునీటి అవసరాల నిమిత్తం శ్రీశైలం జలాశయం నీటిని వాడుతుండడంతో గురువారం నీటి మట్టం 885 అడుగుల నుంచి 856.80 అడుగుల చేరుకుంది. మరో 16 అడుగుల నీరు తగ్గితే పూర్తిస్థాయిలో ఆలయం బయట పడుతుంది.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై విచారణ


విచారిస్తున్న ప్రత్యేక అధికారి రఘురాం

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామంలోని పలు కాలనీలకు చెందిన పలువురు (రెవెన్యూ, పీఆర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్) శాఖలకు సంబంధించిన సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలపై సచివాలయ సిబ్బంది నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. నివేదికపై నియోజవర్గ ప్రత్యేక అధికారి రఘురం గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదులు చేసిన వ్యక్తులు సమస్యలకు పరిష్కారం చూపలేదని, ఈకేవైసీ చేయడం లేదని తెలిపారు. సమస్యలు ఆర్థిక పరమైనవని చెప్పారు. రెవెన్యూలో ప్రభుత్వ భూములు మంజూరు చేయాలని, పీఆర్ కింద సీసీ రహదారి మంజూరు చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ కింద డ్రైనేజీ, పైపులైన్ పనులు చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు.

సమస్యాత్మక భూముల పరిశీలన


ముంపు భూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్పీ

కొత్తపల్లి: మండలంలోని జనాలగూడెం, బలపాల తిప్ప, సిద్ధేశ్వరం గ్రామాల సమీపంలోని శ్రీశైలం వెనుకజలాలలో నుంచి బయటపడిన మునక భూములను ఇరిగేషన్ ఎస్పీ శేఖర్‌రెడ్డి గురువారం ఆత్మకూరు ఆర్డీఓ దాసుతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీటినిల్వలు తగ్గితే భూముల్లో సాగుచేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే నీటిమట్టం తగ్గినప్పుడు కూడా ఎవరూ భూములను సాగుచేసుకోకూడదన్నారు. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకూ భూముల వద్దకు వెళ్లకూడని సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం


మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సురేంద్రకుమార్

మహానంది: పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు నంద్యాల జిల్లా నీటి యాజమాన్య సంస్థ అంబుడ్స్ పర్సన్ డాక్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గూడెంలో 21ఎకరాల్లో సాగు చేస్తున్న పండ్ల తోటలను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యుత్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఓ మనోహర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దేవతలకు గంగపూజ

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో ప్రజలు గురువారం గ్రామంలోని దేవతామూర్తులకు గంగపూజ చేశారు. వర్షాలు పడక రైతులు సాగుచేసుకున్న పంటలు ఎండుముఖం పట్టి దెబ్బతినే స్థితిలో ఉన్నాయి. దీంతో గ్రామస్తులు గంగమ్మ కరుణించమ్మ అని బిందెలతో గ్రామంలో మేళతాళాలతో పార్వతీ సమేత వేణుగోపాల స్వామివార్లు, సచివాలయం వద్ద ఉన్న సల్కాపురం లింగమయ్య స్వామివార్లకు, గ్రామ దేవతలకు బిందెలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు


ఇస్రో ఆకారంలో నిలిచి హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

మిడుతూరు: చంద్రయాన్ -3 విజయవంతమైన సందర్భంగా మండలంలో సంబరాలు చేసుకున్నారు. గురువారం మండలపరిధిలోని వీపనగండ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇస్రో ఆకారంలో నిలిచి దేశభక్తి గీతాలు ఆలపించారు. అనంతరం హెచ్‌ఎం రవికుమార్ ఆధ్వర్యంలో పురవీధుల గుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్ యాదవ్, మౌలాలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేయాలని

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పగిడ్యాలలో రెండో రోజు కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- పలువురు అధికారులు హాజరు కాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం


రేషన్ పంపిణీపై డిప్యూటీ తహసీల్దార్ మురళిపై మండిపడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా ఉండి పనిచేయాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. గురువారం స్థానిక సచివాలయం-1 పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. బస్టాండు ఏరియా నుంచి ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ బావుటా పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారు పొందిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మురుగు కాలువలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని కాలనీకి చెందిన చంద్రకళ, సోమేశ్వరి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ ఎక్కడా అంటూ పిలిచారు. ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంపై మండిపడ్డారు. ఉదయం 9.30 గంటలకు రమ్మంటే వచ్చాను.. పని లేక వచ్చాననుకున్నారా అంటూ ఆగ్రహించారు. ఎక్కడెక్కడో ఉంటే సమస్యలకు సమాధానం ఎవరు చెప్పాలని ఎస్ఈకి రిపోర్ట్ చేస్తానని హెచ్చరించారు. అలాగే దాదాపు 5 నెలలుగా రేషన్ బియ్యం సరిగా వేయడం లేదని దేవనగర్‌కు చెందిన మరియమ్మ, దాసరి దాసు, సుబ్బమ్మ, స్వామన్న, పద్మావతిలు ఎమ్మెల్యేతో ఏకరువు పెట్టారు. అక్కడే ఉన్న డిప్యూటీ తహసీల్దార్ మురళిని పిలిచి ఎందుకు వేయడం లేదని పర్యవేక్షణ చేస్తున్నారా లేదా అంటూ ప్రశ్నించారు. 26వ రేషన్ డీలర్ శ్రీరాములు 30 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం చూపించడంతో అతనిపై 6ఏ కేసు నమోదు కాగా వీఆర్వోకు ఇన్‌చార్జ్ వేశామని సమాధానం చెప్పారు. పలు సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని సమ బంధిత అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వరలక్ష్మీ, భూశమ్మ, లక్ష్మీదేవిలు నిర్వహించే అంగన్‌వాడీ సెంటర్లను ఎమ్మెల్యే సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎంఈఓ సుభాన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సగినేల రమణ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

పగిడ్యాల: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి గురువారం ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు వినతి పత్రం అందజేశారు. పగిడ్యాలలో గడప గడప కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బాబు, హైమావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జలచౌర్యంపై చర్యలు తీసుకోండి

కొత్తపల్లి: మండలంలోని సింగరాజుపల్లి గ్రామం గంగరేగు వాగు చెరువు నుంచి ఆయిల్ ఇంజిన్లు, ట్రాక్టర్ ఇంజిన్ల ద్వారా అక్రమంగా నీటిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, చెరువు కింద సాగుతున్న పంటలను కాపాడాలని సీపీఎం మండల నాయకులు ఎన్ స్వాములు, సంజీవ రాయుడు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రైతులు ఏసన్న, రమణ, బాలస్వామి రాముడు, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సిద్ధాపురం' నుంచి నీటి విడుదల

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నుంచి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం సాగునీటిని విడుదల చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. సిద్ధాపురం చెరువుకు ఎత్తిపోతల పథకం నుంచి సాగు నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నీటి వనరులను బట్టి పంటలు వేసుకోవాలి

మహానంది: రైతులు నీటి వనరుల లభ్యతను బట్టి పంటలను వేసుకోవాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఏడీఏ సరళమ్మ సూచించారు. బొల్లవరం గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి వరిపైరు స్థానంలో ఇతర మెట్ట పంటలను సాగు చేస్తే నష్టాల నుంచి గట్టెక్కే అవకాశాలు ఉంటాయన్నారు. ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, ఆటో యూనియన్ జిల్లా నాయకులు రామచంద్రుడు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద ఆటో స్టాండ్‌లో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

బోర్డు ఏర్పాటు వివాదాస్పదం

పగిడ్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలోని వీర ముసలాయ గుడి వద్ద రోడ్డు పక్కన స్థలంలో ఓ వర్గానికి చెందిన వారు బోర్డు ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. గురువారం రాత్రి బోర్డును ఏర్పాటు చేస్తుండగా మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో వాదోపవాదాలు పెరగడంతో ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గీయులను హెచ్చరించి చెదరగొట్టారు.

పాలన ప్రజలకు చేరువ చేసేందుకే అడ్వైజరీ కమిటీ


కమిటీ చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న దశ్యం

వెలుగోడు: ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు విద్యుత్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేశారని ఎంపీపీ, నూతన అడ్వైజరీ కమిటీ చైర్మన్ లాలం రమేష్ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో గురువారం విద్యుత్ అడ్వైజరీ కమిటీ సమావేశం ఏఈ పి.రవీంద్రనాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్‌గా లాలం రమేష్, కమిటీ సభ్యులు జి.స్వామిరెడ్డి, ముంతల విజయభాస్కర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. సమావేశంలో రైతులకు ఇచ్చే 9 గంటల ఉచిత విద్యుత్‌పై చర్చించారు. విద్యుత్ సరఫరా, పెండింగ్ సమస్యలపై ఆరా తీశారు. ఉదయం పూట రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. సర్పంచ్ వేల్పుల జయపాల్ మాట్లాడుతూ..పట్టణంలోని లక్ష్మినగర్, సీపీ నగర్, ద్వారకానగర్ కాలనీలకు థర్డ్ ఫేస్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కమిటీ చైర్మన్, సభ్యులను ఆర్యవైశ్యులు, రైతులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఏడీ సతీష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కే.రామ్మోహన్‌రెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, రైస్ మిల్లుల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం తగదు

మిడుతూరు: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం తగదని, పనులు వేగవంతం చేయాలని నంద్యాల జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ భాస్కర్ నాయుడు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న కాలనీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో కడుమూరు, నాగలూటి, పైపాలం, కలమందలపాడు, 49- బన్నూరు, మిడుతూరు, రోళ్లపాడు, బైరాపురం, పీరుసాహెబ పేట గ్రామాల్లోని జగనన్న కాలనీలకు ద్వార మందిరాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో మందిరానికి రూ. 5 లక్షలు చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు. ఇంటింటికి ఇంకుడు గుంతలు తవ్వించుకోవాలని, ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ .6 వేలు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సుబ్బానాయక్, అంజాద్ బాషా, ఆపరేటర్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు వరలక్ష్మీవ్రతం

మహానంది: మహానంది దేవస్థానంలోని అభిషేక మండపంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ కాపుచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం, శుక్రవారం పురస్కరించుకుని ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది వరలక్ష్మీవ్రతం వైభవంగా నిర్వహించనున్నామన్నారు. నంద్యాలకు చెందిన ఏజీఎస్ జ్యూవెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్ దంపతుల ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చెంచుల అభివృద్ధికి సమగ్ర సర్వే


సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఐటీడీఏ పరిధిలో ఉన్న 14 మండలాల్లోని చెంచుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టింది. గురువారం నంద్యాలలోని జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి పర్యవేక్షణలో ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. గిరిజన గూడేల్లో సిబ్బంది పర్యటించి వారి స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదికను ఈ నెల చివరిలోగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ ఎ.సురేష్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహాల మరమ్మతుకు అనుమతులు తప్పనిసరి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో గృహాలకు మరమ్మతులు చేయించుకోవాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ రాజేంద్ర సింగ్ అన్నారు. నూతన కట్టడాలకు అనుమతి లేదని, ఎవరైనా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సున్నిపెంట గ్రామాన్ని పంచాయతీ రాజ్‌శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం మే 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అక్రమకట్టడాలను నిరోధించడం కోసం జిల్లా కలెక్టర్ మజనీర్ జిలానీ శామూన్ పంచాయితీ రాజ్‌శాఖకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇప్పటికే నివాసం ఉంటున్న ఇళ్లకు ఏమైనా మరమ్మతులు చేసుకోవాలంటే తహసీల్దార్ అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉందని చెప్పారు.